పాపామ్మ నీపాట బాగున్నదమ్మ
నీముందు నేనింక పాడలేనమ్మ
నీవు నేను కలసి పాడుతూనుంటే
ఈపేటవారలకు ఇక పాటలేవి?
పాటలెరిగిన మనము పాడుతూనుంటే

పాటలెఱిగినవార్కి మాటలేలమ్మ
పేటవారలమాట పాటించకమ్మ
పాటమెరిగినపాట పాడవోయమ్మ
మనవారిమాటలకు మనకేల వులుకు
మనపాటలకు నేడు మాధవుడు బలుకు.

## ౨. కథలు

# బాదరాయణసంబంధము

శ్రీమతి టి. సుప్పమ్మ గారు

మనలో సహజముగ ననేకులు సామెతలను కలిపి ముచ్చటించుటకు వాడుకలేనివారై యున్నారు. సమయానుకూలముగ యుక్తాయుక్తవిచక్షణలెరిగి లోకోక్తులగలిపి ముచ్చటించుటయు భాష కొక భూష యనియే నాతలంపు. సామెతలు గల్గుట కొకకారణము మొదట నుండియేయుండును. "బాదరాయణ సంబంధ" మని మనము సమయానుకూలముగ వాడుచుండుసామెత కొకచిన్నగాథను నేను కర్ణాకర్ణిగా విన్నటుల నిందు చేర్చుచున్నదాన.

అనగాఅనగా ఒకఊరిలో నొకబ్రాహ్మణు డుండేవాడు. ఆయనకు నలుగురుకొడుకులు నలుగురు కూతుళ్ళు ఉండేవారు. ఆయనే ఆవూళ్ళోకెల్ల అన్నివిధాల సంపన్నుడని చెప్పాలి. వారింట్లో ఎప్పుడు వచ్చే వాళ్ళువస్తూయుంటే, వేసేవిస్తరివేస్తూయుంటే, తినేవాళ్ళుతింటూయుంటే నిరతాన్నదానము జరుగుతూయుండేది. ఆయనభార్యకూడా విసుగువేసటలేకుండా అన్నపూర్ణవలె వంటయింట్లోనే ఆవిడకు పని సరిపోతూయుండేది. వాళ్లింటికి ఎవరువచ్చినాసరే, ఎవరుపోయినాసరే 'ఎందుకువచ్చారు. ఎన్నాళ్లుండేరు.' అని అడుగకయే కావలసిన ఉపచారాలు ఎంతఅనామికునికైన వియ్యంకునిలాగు చేస్తూయుండేవారు. సంస్థానములాగు జరుగుతూయుండేది. ఈలాయుండగా ఈసడి ఒక సాపాటురాముడు దూరతోపాస్తివాడు గ్రహించి పెట్టెబేడా, గుడ్డగుడుసూ, భార్యాపిల్లలూ బండీఎద్దూ, నౌకరీతోటి బబర్‌దస్తుతో తినేసిన తాసీలుదారుడిలాగు అట్టహాసముగావచ్చి వేళవేళకు తిండితీర్థాలతోటి కాలము గడుపుకొంటూయుండేడు. అసలు యింటియజమాను డేమనుకొన్నాడు ఈ తినేసిన తాసీలుదారును చూచి? తన కోడండ్రకో అల్లుండ్లకో నిండా అయిన బంధువని అనుకొన్నాడు ఆతాసీలుఆయన ఆవిడయుండే కలియకలుపుతనాన్నిచూచి. అంతే కాకుండా తన కోడండ్రబాంధవ్యములోను, అల్లుండ్రబాంధవ్యములోను గొప్పఉద్యోగస్థులున్నారని వినడంబట్టి ఇంటి యజమానురాలు ఏమనుకొన్నదో ఎరుగుదురా? తనపెనిమిటికి తెల్సినవారనుకొన్నది. కొడుకులూ—తన తండ్రికో, బావమరుదులకో తెల్సినవారనుకొన్నారు. కోడండ్రేమనుకొన్నారు? తమపెనిమిట్లకో, మామగారికో, యింటిఅల్లుండ్రకో తెల్సినవారనుకొన్నారు. కూతుళ్ళును, అల్లుండ్రును ఆలాగే తలచేరు వారివారిపనులను వారు చూచుకొంటూయుండే అలవాటుగనుక. ఈలా కొన్నినాళ్ళు, వారములు, పక్షములు, నెలలు గడిచాయి. ఆబ్రాహ్మడిమూడవకొమారుడు యిప్పటి నవయువకులజట్టులో చేరినవాడు. చురుకుగల బుద్ధిమంతుడు. ఆత డీలా యెంచేడు ఒకనాడు. "ఎవడు ఈనవీనుడు? నాకు తెల్సినంతలో ఎందరో అతిథులు మాయింటికి వచ్చిరి. ఎవరికి ఇంతగా ఉపచారాలు, ఇంతగా శుశ్రూషలు జరిగేవిగావు. మావారు ఎంతనిరతాన్నదాతలయినా ఈయన 'ఎవరు? ఎందుకొచ్చేరు? ఇంతకాలముండడములో ఎవరికి బాంధవ్యము?' అని విచారించినవారేకారు. వీరికి ఏమి పనిలేదూ, పాటూలేదు. వచ్చి ఆరుమాసాలయింది. ఎవరు వీరిని విచారించువారు యింతకు కనుబడలేదు. అయినా నాన్నగార్ని అడిగి తెల్సుకోవాలి.' అని ఒకరాత్రి భోజనాలుముగిసినతోడనే బిరబిర నాన్నగారి వద్దకుపోయి 'నాన్నగారూ, ఆరుమాసాలుగా మనయింట్లో సమస్తఉపచారాలతోటి వియ్యంకునిలాగు విందు

గుడుస్తూవుండే పెద్దమనిషి ఎవరని అడిగేడు. తల్లిని, అన్నలను, అల్లుండ్రను యింట్లోవారందరిని అడిగేశాడు వరుస తప్పకుండా. అందరూ మాకు తెలియకువాళ్లను. అనుగు మాకు తెలియగువాళ్లను విచారించు అంటూ అందరు దీపముదగ్గర గుమిగూడిచేరితర్కించేరు ఫలితము ఎవరికి సంబంధించినవాడు కాడని తేలింది. ఇంట్లో వీరందరు కలిసి మాట్లాడుకోవడము వీధియరుగుపై భార్యతో ముచ్చట్లు ఆడుచున్న ఆతడు విన్నాడు. అరేఅరే మనగుట్టు యింక బయటపడుతుంది యిక్కడవుంటే ఇక్కడ యింక ఉండడము పరువుగాదు. స్థానభ్రష్టత్వంచేయాలి. ఇక్కడ అనువుపడదు.' అని ఆతీసేసినతాసీలు లోపలజరిగిన గడిబిడిఅంత భార్యకు రహస్యముగా చెప్పి 'ఏలా వీరడిగిన ప్రశ్నకు జవాబు చెప్పతానురా'అని రాత్రిఅంతా ఉబుసుపోక అట్లాయిట్లా పొర్లుచూ ఆలోచిస్తూ కోడినిద్రతో కాలముగడిపేశాడు. పొద్దున్నే నిద్రలేస్తూనే పెట్టెబేడ సర్దుకొని బండి కట్టించి భార్యను పిల్లల్ని బండెక్కించేడు. మన నవయువకుడు నిద్రలేచినతోటే అదేకలవరముండేవాడుకనుక ముందుగా తలాకిట్లోకి మరవియ్యంకుని విచారించటానికి వచ్చేడు. కుటుంబమంతా వచ్చిందది యీ తమాషా చూడటానికి. అప్పుడు యింటిముసలాయన ముందుకు వచ్చి 'ఎవరయామీరు? చాల రోజులనుంచి మాయింట నుండినను మంచిచెడ్డలను విచారించకపోతిమి మన్నించాలి. అని పాతకాలపుమోస్తరు భయభక్తులతో అడిగేడు. అప్పుడానవీనుడు యీ క్రిందివిధాన శ్లోకము చెప్పుచు బండిఎద్దును అదలించాడు. శ్లో. అస్మాకం బదరీచక్రం యుష్మాకం బదరీతరుః బాదరాయణసంబంధం యూయంయూయం వయంవయం. అనగా 'మాబండిచక్రాన్ని రేగుకర్రతో చేయించాము. మీపెరటిలో రేగుచెట్టున్నది. ఇన్నాళ్లు మీయింటిలో విందులుగుడవటానికి యీ బాదరాయణసంబంధమేకాని, మీరుమీరే. మేముమేమే.' అంటూ ఎద్దును అదలించి అదిలించి తరుముకొంటూ పారిపోయాడు. అప్పుడు కుటుంబమంతా తమ తెలివితక్కువతనానికి చాలా ఆశ్చర్యపడ్డాది. కథ కంచికి వెళ్లింది. కామాక్షమ్మ యింటికి వచ్చింది.

## వాయస మహాసభ

శ్రీమతి కే. రోజియమ్మగారు

ఒకప్పుడు కాకు లోకయరణ్యప్రదేశమందు సభజరుపనిశ్చయించి మయూరమరాళ గరుడకపోతశకుంతసంతానములకును, జలచరములగుమత్స్యములకును, తుదకు మానవులకును ఆహ్వానపత్రికలనంపెను. సభాస్థల మొకవిశాలవటవృక్షము. పక్షులు శాఖలపై గూర్చుండెను. ఇతరమృగములన్నియు పచ్చికబయలు నలంకరించెను.

అంత నొకహంస లేచి, సభనుద్దేశించుచు జెముడుకాకి నగ్రాసనాధిపత్యము వహింపగోరెను. అన్నియు నేకగ్రీవముగా నొప్పుకొనెను. తక్షణమే జెముడుకాకి యెగిరియున్నతాసనమలంకరించెను. పక్షులు కలకలారవములుసేయుచు సంతోషసూచకముగ టపటప రెక్కలుగొట్టెను. అగ్రాసనాధిపతి తొలిపలుకులు కొన్నిబలికి కూర్చుండ చిరంజీవి లేచి సముచితరీతి నిట్లుపన్యసించెను.

భ్రాతృవరులారా! స్వజాతీయులారా! మానవశ్రేష్ఠులారా! పరాత్పరునిసృష్టిలో పక్షిజన్మ మెంతయుత్కృష్టమైనది! అట్టిజన్మమెత్తుట కరంబు సుకరంబుగాదు. ఎన్ని నోములునోచినగాని, ఎన్నిక్రతువులొనర్చినగాని, ఏయేతీర్థములుగ్రుంకిడినగాని నిట్టిజన్మము కలుగగలదు? వేయేల! పక్షిజన్మమెత్తుటయను మహాభాగ్యము పూర్వజన్మసుకృతఫలముగాని